సాక్షి పార్వతీపురం మన్యం

ఆదివారం | 15 | అక్టోబర్ | 2023



అక్కచెల్లెమ్మలకు ఆర్థిక దన్ను

అధికారంలోకి వచ్చిన తొలినాళ్ల నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళా ప్రగతే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. - 10లో



ఆర్‌పీలపై చర్యలు తీసుకుంటాం

తప్పు చేసిన ఆర్‌పీలపై చర్యలు తీసుకుంటామని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. - 10లో



సెలవుల సందడి

దసరా సెలవులు కావడంతో విద్యార్థుల రాకపోకలతో బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు శనివారం కళకళలాడాయి. - 10లో

న్యూస్‌రీల్

నేడు కోటదుర్గమ్మ నిజరూప దర్శనం



పాలకొండ: దసరా ఉత్సవాలకు పాలకొండ కోటదుర్గమ్మ ఆలయం ముస్తాబైంది. ఆదివారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు ఆలయ అధికారులు సర్వం సిద్ధంచేశారు. తొలిరోజు భక్తులకు అమ్మవారి నిజరూప దర్శనం కల్పిస్తారు. ఏడాదిలో ఒక్కరోజు కొన్ని గంటలు మాత్రమే కలిగే అమ్మవారి నిజరూప దర్శనానికి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారని అంచనా వేసి ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు అమ్మవారి నిజరూపదర్శనం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణాధికారి మురిశీకృష్ణ తెలిపారు. ఉదయం 7 గంటలకు పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, తొలపూజ నిర్వహిస్తారన్నారు. అనంతరం అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తామని చెప్పారు. ఉచిత దర్శనంతో పాటు రూ.30, వీఐపీ, వీవీఐపీ క్యూలు ఏర్పాటుచేశామన్నారు.

క్రికెట్ సంబరం



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: భారత్–పాకిస్తాన్‌ల మధ్య శనివారం జరిగిన వన్‌డే మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించడంతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు, క్రీడాకారులు పార్వతీపురం నాలుగు రోడ్ల కూడలి వద్ద కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. వరల్డ్ కప్‌ను ఇండియా సొంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇండుపూరు గుణేశ్వరరావు, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, గొర్లి మాధవరావు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త..!

- జిల్లా ప్రజలకు పోలీస్‌శాఖ విజ్ఞప్తి



డీఎస్పీ జి.మురళీధర్

పార్వతీపురం టౌన్: దసరా సెలవుల్లో ఇంటికి తాళం వేసి ఊరెళ్తున్నారా? అయితే మీ సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వండి... దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచుతామని పార్వతీపురం డీఎస్పీ జి.మురళీధర్ శనివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సొంత గ్రామాలకు వెళ్లేవారు విలువైన ఆభరణాలు, నగలు ఇళ్లల్లో ఉంచవద్దన్నారు. బ్యాంకు లాకర్లు, బంధువుల ఇళ్లలో భద్రపరచుకోవాలని సూచించారు. గ్రామాలు, కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని పేర్కొన్నారు. వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేసుకోవాలని, నిర్లక్ష్యంగా ఇంటి బయట పెడితే చోరీలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పట్టణ వాసులు తమ ఇళ్లకు సీసీ కెమెరాలు అమర్చుకోవడం ఉత్తమమన్నారు. అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్, మార్కెట్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాలతో పాటు వ్యాపార సముదాయాల్లో 24 గంటలు సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మెన్‌లు ఉండేలా చూసుకోవాలన్నారు.

వైద్యశాలలకు కొత్త కళ



నిర్మాణం పూర్తయిన పార్వతీపురం ప్రభుత్వాస్పత్రి

- నాడు–నేడు నిధులతో కొత్త భవనాల నిర్మాణం, ఆధునిక హంగులు
- జిల్లాలో మారుతున్న ఆస్పత్రుల రూపురేఖలు
- రెండు మల్టీస్పెషాల్టీ ఆస్పత్రులకు రూ.98.58 కోట్లు
- సీహెచ్‌సీల అభివృద్ధికి రూ.28.95 కోట్లు
- జిల్లా ఆస్పత్రి పడకల పెంపునకు రూ.21.15 కోట్లు
- సీతంపేట ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి రూ.19.07 కోట్లు
- రోగులకు మరింత చేరువకానున్న వైద్యసౌకర్యాలు

పార్వతీపురంటౌన్: ప్రజారోగ్యంపై జగన్‌మోహన్ రెడ్డి సర్కారు ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ సేవలు, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో ఊరిచెంతనే వైద్యసేవలు అందిస్తోంది. మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వీలుగా నాడు–నేడు నిధులతో ప్రభుత్వాస్పత్రులకు ఆధునిక సొబగులు అద్దుతోంది. పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకంతో పాటు అవసరమైన పరికరాలు, బెడ్‌లు, అదనపు భవనాలు, మౌలిక వసతులు కల్పిస్తోంది. దీనికోసం కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తోంది. ఇప్పటికే కొన్ని ఆస్పత్రుల పనులు పూర్తికాగా, మరికొన్ని ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పన పనులు చివరిదశలో ఉన్నాయి.

జిల్లాలో ఆస్పత్రులు ఇలా..

పార్వతీపురం మన్యం జిల్లాలో కొద్దినెలల్లో బోధనాస్పత్రి నిర్మితంకానుంది. ఇప్పటికే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు సాగుతున్నాయి. సాలూరు, పాలకొండ, సీతంపేటలోని ఏరియా ఆస్పత్రులు, మరో 3 కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు (సీహెచ్‌సీలు),

జిల్లాలో ఆస్పత్రుల అభివృద్ధికి రూ.28.95 కోట్ల కేటాయింపు

ఆస్పత్రి	పడకల సంఖ్య పెంపు	కేటాయించిన నిధులు
సాలూరు ఏరియా ఆస్పత్రి	30నుంచి 100	రూ.17 కోట్లు
కురుపాం సీహెచ్‌సీ	30 నుంచి 50	రూ.3 కోట్లు
భద్రగిరి సీహెచ్‌సీ	30 నుంచి 50	రూ.8.95 కోట్లు
సీతంపేట ఏరియా ఆస్పత్రి	30 నుంచి 100	రూ. 19.07 కోట్లు
పార్వతీపురం జిల్లా ఆస్పత్రి	100 నుంచి 150	రూ. 21.15 కోట్లు

37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 అర్బన్ హెల్త్ సెంటర్లు రోగులకు సేవలందిస్తున్నాయి. ఆస్పత్రిలో పాడైన ప్రతి భవనాన్ని ప్రభుత్వం ఆధునీకరిస్తోంది.

అన్ని రకాల వైద్య సేవలు

కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఒక గైనకాలజిస్టు, ఒక పీడియాట్రిస్ట్, ఒక అనెస్తెటిస్ట్, ఒక జనరల్ మెడిసిన్, ఒక జనరల్ సర్జన్, ఇద్దరు సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్థాయి వైద్యులు ఉంటారు. వీరితో పాటు నర్సులు, ఇతర సిబ్బంది కలిపి ప్రతి సీహెచ్‌సీలో 31 పోస్టుల వరకు మంజూరయ్యాయి. జిల్లాలో అన్నిచోట్ల వైద్యం సమయానికి అందుతోంది. ఆయా ఆస్పత్రుల పరిధిలో సాధారణ, సిజేరియన్ ప్రసవాలతో పాటు రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాల్లో గాయపడిన వారికి చికిత్స చేయడంతో పాటు అత్యవసర మెడికల్ వైద్యాన్ని కూడా అందించేందుకు ప్రభుత్వం వైద్యులను నియమించింది. పెద్దపెద్ద జబ్బులకు మాత్రమే జిల్లా ఆస్పత్రులకు రోగులను వైద్యులు రిఫర్‌చేస్తున్నారు.

ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో పడకల పెంపు

జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం, వైద్య పరీక్షలతో పాటు అధికమందికి వైద్యసేవలందించేలా పడకల సంఖ్యను ప్రభుత్వం పెంచుతోంది. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో రూ.21.15 కోట్ల ఖర్చుతో 100 నుంచి 150 పడకలను పెంచింది. సీతంపేట ఏరియా ఆస్పత్రిలో రూ.19.07 కోట్ల వ్యయంతో 30 నుంచి 100 పడకల పెంచుతూ నూతన భవనాన్ని నిర్మిస్తోంది.

రూ.98.58 కోట్లతో జిల్లాకు రెండు మల్టీస్పెషాల్టీ ఆస్పత్రులు

ఒకప్పుడు గిరిజన ప్రాంత ప్రజలు మెరుగైన వైద్యం కావాలంటే ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని సుదూర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండేది. గిరిజనులెవరూ వైద్యం అందక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో నూతనంగా ఏర్పడిన మన్యం జిల్లాకు రెండు మల్టీస్పెషాల్టీ ఆస్పత్రులను ప్రభుత్వం మంజూరుచేసింది. గిరిజన గ్రామాలకు కేంద్రాలైన పార్వతీపురం, సీతంపేటలో ఒక్కో ఆస్పత్రికి రూ.49.29 కోట్ల చొప్పున రెండింటికి రూ.98.58 కోట్లను కేటాయించింది.



నిర్మాణంలో ఉన్న సీతంపేట ఏరియా ఆస్పత్రి



నిర్మాణంలో ఉన్న పార్వతీపురం యూపీహెచ్‌సీ

జోరుగా పనులు



జిల్లాలో ఏరియా ఆస్పత్రులు, 3 సీహెచ్‌సీలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నాం. ఇందులో ఇప్పటికే సగం పూర్తయ్యాయి. మిగిలిన పనులు మూడు నుంచి ఆరు నెలల్లో పూర్తవుతాయి. భవనాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

– ప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ, పార్వతీపురం మన్యం

మెరుగైన వైద్యసేవలు



ప్రస్తుతం సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. కొత్త భవనాలు, సౌకర్యాలు అందుబాటులోకి వస్తే రోగులకు మరింత మేలు కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు నిధులతో ఆస్పత్రుల అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తిచేయిస్తోంది.

– డా.బి.వాగ్దేవి, డీసీహెచ్‌ఎస్, పార్వతీపురం మన్యం జిల్లా

గుమ్మడి సంధ్యారాణికి... తత్వం బోధపడింది!

నాడు: రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సాలూరు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన గౌరవానికి భంగం కలిగేలా టీడీపీ వారు సోషల్ మీడియాలో చాలా అభ్యంతరకరమైన పోస్టులు పెట్టేవారు. అయినప్పటికీ రాజన్నదొర సంయమనం పాటించేవారు. దీన్ని అలుసుగా తీసుకొని టీడీపీ కార్యకర్తలు మరింత రెచ్చిపోయారు. ఆయన్ని వ్యక్తిగతంగానూ కించపరిచేలా పోస్టులుపెట్టారు. వీటిని చూసి విసిగిపోయిన రాజన్నదొర అనుచరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలోనూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను కించపరుస్తూ టీడీపీ వారు అసభ్యకరమై పోస్టులతో పేట్రేగిపోయారు. వైఎస్సార్‌సీపీ అభిమానుల ఫిర్యాదులతో పోలీసులు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. అహా... సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కేసులు పెడతారా? అంటూ టీడీపీ నాయకులను గుమ్మడి సంధ్యారాణి సమర్థించేవారు.

నేడు: 'నేను గుమ్మడి సంధ్యారాణిని... మాజీ ఎమ్మెల్సీని... టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలిని.. అరకు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షురాలిని. సాలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిని... కానీ నా గౌరవానికి భంగం కలిగించేలా. బయటకు చెప్పుకోలేని విధంగా నన్ను లక్ష్యంగా చేసుకొని ఓ వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నాడు. అతడిపై కఠిన చర్యలు తీసుకోండి...' అంటూ టీడీపీ నాయకురాలు గుమ్మడి సంధ్యారాణి సాలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుభవమైతే గానీ తత్వం బోధపడలేదు ఆమెకు! తనపై పోస్టులు పెట్టింది సొంత టీడీపీ వ్యక్తేనని తెలిసినా. ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడానికీ సిద్ధమయ్యారు. ఆ వ్యక్తి టీడీపీలో తన ప్రత్యర్థి భంజ్‌దేవ్ వర్గీయుడేనని తెలిసి మరింత గరంగరం అవుతున్నారు. కొద్దిరోజులుగా తనను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న భంజ్‌దేవ్ వర్గీయులను పార్టీ నుంచి పొగపెట్టి అయినా బయటకు పంపించేయాలని రగిలిపోతున్నట్టు తెలిసింది.



- సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై గరంగరం
- సొంత టీడీపీలోని వ్యతిరేకుల నుంచే వరుస పోస్టులు
- మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ వర్గీయుడిపై అనుమానం
- సెల్‌ఫోన్ నంబర్లు ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు!

సాక్షి ప్రతినిధి, విజయనగరం: సాలూరు టీడీపీలో వర్గవిభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. తనపై, తన వర్గీయులపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారంటూ ఇటీవల ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మడి సంధ్యారాణి సాలూరు పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడం దీనికో నిదర్శనం. పోస్టులు పెట్టిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్ అనుయాయుడని తెలిసింది. అయితే ఇప్పటివరకూ పోలీసులు కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

తలెగరేస్తే తొక్కేయడమే...

టీడీపీలో తన వర్గీయులే కాదు వ్యతిరేక వర్గం వారైనా తలెగరేస్తే పాతాళానికి తొక్కేసేవరకూ సంధ్యారాణి నిద్రపోరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరకు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు వద్ద పంచాయితీ జరిగినా సరే తన వైఖరిలో మార్పు ఉండదనే చెబుతున్నారు. పాచిపెంట మండల టీడీపీ అధ్యక్షుడి మార్పు అంశాన్ని సాలూరు ప్రజలు చర్చించుకుంటున్నారు. తనకు కొరకురాని కొయ్యగానున్న భంజ్‌దేవ్ విధేయుడు పిన్నింటి ప్రసాద్‌ను ఆ పదవి నుంచి ఇటీవల సంధ్యారాణి తప్పించేశారు. తన అనుచరుడిగాఉన్న ముఖీ సూర్యనారాయణకు అధ్యక్ష పదవి అప్పగించారు. ఇది నచ్చని పాచిపెంట టీడీపీ నాయకులు ఈ పంచాయితీని నేరుగా చంద్రబాబు వద్దకు తీసుకెళ్లారు. సాలూరు నియోజకవర్గ సమీక్ష సమావేశంలో ఈ విషయం ప్రస్తావించారు. దీంతో చంద్రబాబు సంధ్యారాణిపై ఆగ్రహం వ్యక్తం చేశారని సాలూరు టీడీపీ నాయకులు ఇప్పటికీ చెబుతూనే ఉంటారు. చంద్రబాబు తీసుకున్న క్లాసు ఫలితంగా పిన్నింటి ప్రసాద్‌కు మళ్లీ పాచిపెంట టీడీపీ మండల అధ్యక్ష పదవి దక్కింది. కానీ ఇప్పటికీ ప్రసాద్‌తో సంధ్యారాణి ఎడముఖం పెడముఖంగానే ఉంటున్నారు.

మక్కువ మండలంలోనూ మంటలు...

బీజేపీ నుంచి ఇటీవలే టీడీపీలో చేరిన పెంట తిరుపతిరావు అన్నా సంధ్యారాణికి పొసగట్లేదు. మక్కువ మండలంలో కాస్త పలుకుబడి ఉన్న తిరుపతిరావు పట్ల తొలి నుంచీ ఆమెది అదే వైఖరి. అతను భంజ్‌దేవ్ అభిమానిగా ఉండటమే అసలు కారణం. దీంతో రెండు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. సాలూరు మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ గొర్లి విజయకుమారి భర్త మధుతో కూడా సంధ్యారాణికి సయోధ్య లేదనేది బహిరంగ రహస్యమే.

ఒంటెద్దు పోకడపై పోస్టులు...

సంధ్యారాణి అనుసరిస్తున్న ఒంటెద్దు పోకడ నచ్చకే భంజ్‌దేవ్ తదితర టీడీపీ నాయకుల అనుచరులు ఆమెపై పోస్టులు పెడుతూ వస్తున్నారు. పార్టీ గ్రూపుల్లోనూ రచ్చ రచ్చ చేస్తున్నారు. భంజ్‌దేవ్ మీద గతంలో సంధ్యారాణి వర్గీయులు పెట్టిన పోస్టులు, ఆయన వల్లనే పార్టీ అప్రతిష్ఠ పాలయిందంటూ చంద్రబాబుకు లేఖలు రాయడం దీనికి ఆజ్యం పోసింది. ఆ పోస్టులు, లేఖలు బయటకు లీక్ చేయడం వెనుక సంధ్యారాణి అనుచరుల పాత్ర ఉందని భంజ్‌దేవ్ వర్గీయులు రగిలిపోతున్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొరను కలిసిన జీగిరాం జూట్ కార్మికులు

- డిప్యూటీసీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: జీగిరాం జూట్‌ఫ్యాక్టరీ కార్మికులు అధైర్యపడవద్దని, ప్రభుత్వపరంగా అండగా ఉంటామని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర భరోసా ఇచ్చారు. సాలూరులోని స్వగ్రహంలో రాజన్నదొరను ఎంపీటీసీ సభ్యుడు సూరప్పలనాయుడు, కార్మిక నాయకులు పువ్వల శ్రీనివాసరావు, సింహాచలం, సత్యం తదితరులు శనివారం కలిశారు. కార్మికుల తరపున పోరాడుతున్న రాజన్నదొరకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల వేతనబకాయిల చెల్లింపు, ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి చర్యలు తీసుకోవాలని కార్మికశాఖమంత్రి, కమిషనర్‌తో నేరుగా రాజన్నదొర మాట్లాడం, ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చలు జరిపిన విషయం తెలిసిందే. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఫ్యాక్టరీ యాజమాన్యం సానుకూలంగా ఉందని, వేతన బకాయిలు ఇప్పటికే చాలా మందికి చెల్లించిందని, మిగిలిన కార్మికులకు కొద్దిరోజుల్లో చెల్లిస్తుందని రాజన్నదొర తెలిపారు. ఫ్యాక్టరీనికార్మికులంతా సమష్టిగా నడిపేందుకు యాజమాన్యం అంగీకారం తెలిపిందన్నారు. ఫ్యాక్టరీ అద్దెకూడా వద్దని యాజమాన్యప్రతినిధి సప్తగిరి తెలిపినట్టు కార్మికనాయకులకు వివరించారు. ఫ్యాక్టరీ పునఃప్రారంభించేందుకు తనవంతు కృషిచేస్తున్నట్టు తెలియజేశారు. ఫ్యాక్టరీ నడిపేందుకు ఎవరైనా ముందుకు వస్తే, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ పరంగా రాయితీలు అందించే ఏర్పాట్లు చేస్తానని స్పష్టంచేశారు.

చేసిన తప్పిదాన్ని ఒప్పుకోండి

- ఆవేశపూరితంగా మాట్లాడితే ప్రజలు నమ్మేరోజులు పోయాయ్
- 2014 ఎన్నికలకు ముందులా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు మానుకోండి
- కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు వాఖ్యలు అర్థరహితం
- ప్రభుత్వానికి ఎవరిపైనా వ్యక్తిగత కక్షలు లేవు
- న్యాయస్థానం ఆదేశాల మేరకు జైల్లో చంద్రబాబుకు సౌకర్యాలు
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం: అధికారంలో ఉన్న సమయంలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చేసిన తప్పులను ఒప్పుకోవాలని... లేని పక్షంలో అవినీతి చేయలేదని నిరూపించుకోవాలే తప్ప ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేయడం తగదని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఓట్లతో గెలిచి ఉన్నత పదవులు అనుభవించిన కేంద్ర మాజీమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు చేసిన వాఖ్యలను ఖండించారు. చంద్రబాబుకు అనుకూలంగా మాట్లాడేందుకు ఎటువంటి సమాచారం లేకపోవడంతో ఆవేశపూరితంగా తమ అనుకూల మీడియా ముందు మంచి నీళ్లు కూడా ఇవ్వరా అంటూ వాఖ్యలు చేయడం అర్థరహితమన్నారు. రెండు రోజులుగా స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ఆర్థిక అభియోగాలు ఎదుర్కొంటున్న ప్రతిపక్ష నేత చంద్రబాబు డీ హైడ్రేషన్‌కు గురయ్యారని, చర్మవ్యాధులతో బాధపడుతున్నారంటూ జరుగుతున్న ప్రచారాలను అందరూ గమనిస్తున్నారని, జైళ్ల శాఖ డీఐజీ చంద్రబాబు ఆరోగ్య భద్రతపై ఎప్పటికప్పుడు ప్రకటిస్తున్న హెల్త్ బులెటిన్‌లను ప్రజలు తెలుసుకుంటున్నారన్న విషయం గుర్తించాలన్నారు. న్యాయస్థానం రిమాండ్ విధించిన వ్యక్తికి ప్రభుత్వ విధివిధానాలకు అనుగుణంగా అన్ని చర్యలు తీసుకుంటారన్నది తెలుసుకోవాలన్నారు. 2014 నాటి పరిస్థితుల్లో వలే ప్రజలను తప్పుదోవ పట్టించి ప్రజల సానుభూతి పొందేందుకు కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు తాపత్రయపడుతున్నారన్నారు. జైళ్లశాఖ డీఐజీ వివరణ ఇచ్చిన తరువాత కూడా అశోక్ వాఖ్యలు చూస్తుంటే విడ్డూరంగా ఉన్నాయన్నారు. స్కిల్‌స్కాం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబుకు అందించాల్సిన సౌకర్యాలపై మాట్లాడడం సరికాదన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

రాష్ట్రంలోని ప్రతి పౌరుడి ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వం చూస్తోందని, ఇందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరిట 1.60 లక్షల కుటుంబాల్లోని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి యోగ క్షేమాలను పర్యవేక్షిస్తోందన్నారు. ప్రజల్లో అపోహలు కల్పించేందుకు చంద్రబాబు ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందంటూ భువనేశ్వరి, లోకేశ్‌లు ట్విట్టర్ వేదికగా హంగామా చేస్తున్నారన్నారు. ప్రభుత్వానికి ఎవరిపైనా వ్యక్తిగత కక్షలు లేవన్న విషయాన్ని టీడీపీ నేతలు గమనించాలన్నారు. ప్రజాధనాన్ని ఎవ్వరు దుర్వినియోగం చేసినా వారిపై దర్యాప్తు జరిపి ఆధారాలతో దోషులపై చర్యలు తీసుకోవడం ప్రభుత్వం బాధ్యతగా పేర్కొన్నారు. చంద్రబాబుపై అవినీతి ఆరోపణల కేసు న్యాయస్థానం పరిధిలో ఉందని, న్యాయస్థానం ఆదేశాల మేరకు ప్రభుత్వ పరంగా చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోయిన బ్యాగు అప్పగింత



పోగొట్టుకున్న బ్యాగును ప్రయాణికురాలికి అప్పగిస్తున్న పోలీసులు

రేగిడి: వీరఘట్టం మండలంలోని కొంచ గ్రామానికి చెందిన బోనంగి కీర్తన బస్సులో పోగొట్టుకున్న బ్యాగును ఆమెకు పోలీసులు తిరిగి అప్పగించారు. బెంగళూరు నుంచి ఆర్‌టీసీ బస్సులో వస్తుండగా ఆమె తన లగేజీ బ్యాగు పోయినట్లు స్థానిక పోలీసులను శనివారం ఆశ్రయించి, ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, రంగంలోకి దిగిన పోలీసులు అపహరణకు గురైన ఆమె బ్యాగును 24 గంటలు గడవకముందే పట్టుకుని, ఆమెకు అందించారు. దీంతో ఆమె, ఆమె కుటుంబ సభ్యులు ఎస్‌ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

భార్యపై భర్త దాడి

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని హరిజన పెద్దవీధికి చెందిన చిట్టిరాజు తన భార్య రాజేశ్వరిపై దాడిచేసి గాయపరిచిన ఘటనపై కేసు నమోదైనట్లు సీఐ కె.రవికుమార్ శనివారం వెల్లడించారు. ముడిదాం గ్రామానికి చెందిన రాజేశ్వరికి హరిజన వీధికి చెందిన చిట్టిరాజుకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో కన్నవారు పెట్టిన బంగారు ఆభరణాలను రాజు తన అక్క పద్మకు ఇచ్చాడు. వాటిని తిరిగి తెమ్మన్నందుకు ఆమె భర్తతో పాటు మేనల్లుళ్లు కల్యాణబాబు, సంతుతో పాటు స్వాతి అనే మహిళ కర్రలతో దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొందని సీఐ తెలిపారు.

అయ్యప్ప పూజకు రూ.లక్ష విరాళం



లక్ష రూపాయల విరాళం అందజేస్తున్న అయ్యప్ప భక్తుడు అప్పన్న, రాజేశ్వరి దంపతులు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని బి.జె.పాలెం(గొల్లలపేట) గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తుడు కోరాడ అప్పన్న, రాజేశ్వరి దంపతులు అయ్యప్ప మహాసంగమం పూజకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో విశాఖపట్టణంలోని రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న పూజకు, అన్నసమారాధన కోసం లక్ష రూపాయలను అయ్యప్ప సన్నిదానం గురుస్వామి రాజేశ్వరరావుకు శనివారం అందజేశారు.

మలబార్ గోల్డ్‌లో నెక్లెస్ మేళా

విజయనగరం టౌన్: విజయనగరం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో నెక్లెస్ మేళాను ప్రారంభించినట్టు యాజమాన్య ప్రతినిధులు రెహమాన్, సురేష్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదిన్యాయమైన వాగ్దానాలను అందిస్తూ నూటికి నూరుశాతం బీఐఎస్ హాల్ మార్క్‌తో ధ్రువీకరించబడిందన్నారు. అద్వితీయమైన కళానైపుణ్యంతో ప్రత్యేక నెక్లెస్‌లను రూపకల్పన చేసి ప్రదర్శనలో ఉంచామన్నారు. వినియోగదారులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹250

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక దన్ను

- ఎస్సీ, ఎస్టీ మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం ఊతం
- కొత్తగా ఉన్నతి మహిళా శక్తి పథకానికి శ్రీకారం
- ఆటో కొనుగోళ్లకు వడ్డీలేని రుణం మంజూరు
- జిల్లాకు 9 మంది చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 220 యూనిట్ల పంపిణీ
- డిసెంబరు 6న పథకం అమలుకు కసరత్తు



పథకంపై స్వయం సహాయక గ్రూపు మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైకేపీ సిబ్బంది

సీతంపేట: అధికారంలోకి వచ్చిన తొలినాళ్ల నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళా ప్రగతే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే పలు ప్రభుత్వ పథకాల ద్వారా అన్ని వర్గాల్లోని మహిళలకు న్యాయం చేసిన జగనన్న సర్కారు మరో అడుగు ముందుకు వేసింది. ఎస్సీ, ఎస్టీ మహిళల జీవన స్థితిగతులు మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఆర్థిక భరోసా కల్పించి, వారిని ఉన్నత స్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తోంది. దీనికోసం ప్రత్యేకంగా ఉన్నతి మహిళా శక్తి పథకాన్ని ప్రభుత్వం తీసుకువస్తోంది. వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ద్వారా ఈ పథకంలో భాగంగా ఆటోల కొనుగోళ్లకు వడ్డీలేని రుణం ఇస్తారు. అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి రూ.3 లక్షల చొప్పున రుణం మంజూరు చేస్తారు. ఈ రుణాన్ని వడ్డీ లేకుండా వాయిదాల పద్ధతిలో తీర్చుకునే వెసులుబాటును లబ్ధిదారులకు కల్పించారు. జిల్లాకు తొమ్మిది మంది చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 220 యూనిట్ల పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా మన జిల్లా నుంచి తొమ్మిది మంది లబ్ధిదారులను ఎంపిక చేసే పనిలో ఏపీఎంలు నిమగ్నమయ్యారు. డిసెంబరు ఆరో తేదీన ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.

ఇవీ అర్హతలు..

- స్వయం సహాయ సంఘ(ఎస్‌హెచ్‌జీ) సభ్యురాలై, ఎస్సీ, ఎస్టీ కులానికి చెందిన వారు అర్హులు.
- గతంలో ఎటువంటి రుణం తీసుకుని, ఉండకూడదు.
- లబ్ధిదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- డ్రైవింగ్ చేస్తూ తీసిన వీడియో ఉండాలి.
- ఆటో కొనుగోలు చేసినపుడు 10 శాతం వాటాను మూలధనంగా పెట్టుబడి పెట్టాలి.
- గ్రామీణ ప్రాంతంలో నివసించి ఉండాలి.
- డీజిల్ ఆటోనా, గ్యాస్ ఆటోనా.. ట్రాలీ ఆటోనా అనేది లబ్ధిదారులే ఎంపిక చేసుకోవాలి.
- స్వయం సహాయక గ్రూపు, వీవో తీర్మానం తప్పనిసరి.

విజయవాడలో ప్రత్యేక శిక్షణ..



ఆటో నడపడం, రిపేరు వంటి అంశాలకు సంబంధించి, లబ్ధిదారులకు విజయవాడలో ప్రత్యేక శిక్షణ ఇస్తాం. శిక్షణ కాలంలో శిక్షణార్థులకు ఉచితంగా భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తాం. ఇప్పటివరకు 12 మంది లబ్ధిదారులను ఎంపిక చేశాం. – పార్వతి, ఉన్నతి ఇన్‌చార్జ్ ఏపీఎం,ఐటీడీఏ, సీతంపేట.

లబ్ధి పొందిన తర్వాత..

- లబ్ధిదారు పేరిట రిజిస్ట్రేషన్ చేయాలి.
- తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేసుకోవాలి.
- లబ్ధిదారులే ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ ఫీజులు భరించాల్సి ఉంటుంది.
- 48 నిర్ణీత వాయిదాలు వడ్డీలేని రుణం చెల్లించాలి.
- సకాలంలో లోన్(రుణం) చెల్లించని వారికి అపరాద రుసుం విధించబడుతుంది.

దొంగలు దొరికారు..



చైన్ స్నాచింగ్ కేసు వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు, వెనక ముసుగులో నిందితులు

విజయనగరం క్రైమ్: చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు వెల్లడించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేకరులతో మాట్లాడిన ఆయన ప్రదీప్‌నగర్ శారదా అపార్ట్‌మెంట్‌లో వాచ్‌ఉమెన్‌గా పనిచేస్తున్న ఉడిగల గౌరి అనే మహిళ ఈ నెల 10వ తేదీ సాయంత్రం 3:45 గంటల సమయంలో ఇస్త్రీ చేసిన బట్టలను ఇంటికి తీసుకువెళ్తుండగా, గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి, ఆమె మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని, పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు కొన్ని ఆధారాలు సేకరించారు. శనివారం స్థానిక గూడ్స్‌షెడ్ వద్ద వన్‌టౌన్ ఎస్‌ఐ వి.అశోక్‌కుమార్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టగా, అనుమానాస్పదంగా బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, విచారణ చేశారు. ఈ విచారణలో భీమిలి మండలంలోని వలదపేటకు చెందిన కోనాడ రాంబాబు, కమ్మవీధికి చెందిన బేతా లల్లా అనే ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి దగ్గర నుంచి దొంగిలించిన రెండు తులాల బంగారు పుస్తెలతాడు, 4 కిలోల గంజాయి, ఓ మోటారు బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు ఛేదనలో క్రియాశీలక పాత్ర పోషించిన ఎస్‌ఐ అశోక్‌కుమార్, హెచ్‌సీ ఎం.అచ్చిరాజు, కానిస్టేబుళ్లు టి.శ్రీనివాస్, బి.శివ, బి.శివశంకరరావు, ఎన్.గౌరీశంక్‌లను సీఐ అభినందించారు. సమావేశంలో ఎస్‌ఐ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

- జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.విజయకుమార్



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్ల సభ్యులు

తెర్లాం: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన రెండు జట్లు తమ సత్తాను చాటాలని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.విజయకుమార్ ఆకాంక్షించారు. మండలంలోని నెమలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్లను శనివారం ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాల,బాలికల జట్లను ఉద్దేశించి, కాసేపు మాట్లాడారు. చిత్తూరు జిల్లాలోని నగరిలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న అండర్–19 బాలబాలికల రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులంతా తమ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి, పతకాలు సాధించాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసరావు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్ల సభ్యులను అభినందించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి 60 మంది క్రీడాకారులు జిల్లా జట్ల ఎంపికలో పాల్గొన్నారు.

ఆర్‌పీలపై చర్యలు తీసుకుంటాం

- వారు స్వాహా చేసిన నిధులు రికవరీ చేస్తాం
- మహిళా సంఘాల సమావేశంలో రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు



సీఐ శ్రీనివాసరావుతో తమ గోడు వెల్లబుచ్చుకుంటున్న బాధిత మహిళలు

రాజాం సిటీ: తప్పు చేసిన ఆర్‌పీలపై చర్యలు తీసుకుంటామని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలు, అవకతవకలకు పాల్పడిన ఆర్‌పీలు, మెప్మా సిబ్బందితో సమావేశమైన ఆయన తొలుత సంఘాల వారీగా డబ్బులు దుర్వినియోగమైన తీరును మెప్మా టీఎంసీ ఎస్‌వీ రత్నంను అడిగితెలుసుకున్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలు ఒక్కొక్కరుగా తమ గోడు వెల్లబుచ్చుకున్నారు. సంఘ సభ్యులకు తెలియకుండా, ఫోర్జరీ సంతకాలతో, తప్పుడు తీర్మానాలు చేసి లోనులు(రుణాలు) వాడుకున్న తీరును వివరించారు. ఆర్‌పీలు స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేసి, అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని సీఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, తాను వాడుకున్న డబ్బులను బ్యాంకుకు కట్టేస్తానని ఆర్‌పీ ఉమాదేవి అంగీకరించింది. అయితే లలితాంబ, అన్నమ్మపేరంటాల, వెంకటేశ్వరతో పాటు మరో గ్రూపునకు సంబంధించిన డబ్బులు కట్టేదిలేదని తెగేసి చెప్పడంతో బాధిత మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని సీఐను కోరారు. సోమవారం మరోసారి స్టేట్‌మెంట్‌లను తనిఖీ చేసి, న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. మహిళలంతా సంయమనం పాటించాలని, ఎలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. సమావేశంలో సంతకవిటి ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నాయకురాలు



కేంద్రమంత్రి నారాయణస్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ నాయకురాలు పావని

విజయనగరం అర్బన్: నగరానికి శనివారం విచ్చేసిన కేంద్రమంత్రి ఎ.నారాయణస్వామిని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు రెడ్డి పావని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె జిల్లాలో బీజేపీ బలపడుతున్న తీరు, ఆ పార్టీ బలోపేతానికి ఆమె చేస్తున్న కృషిని వివరించారు. ప్రజలకు అందుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి



మృతుడు సన్యాసి నాయుడు

గంట్యాడ: పాముకాటుతో సన్యాసినాయుడు (52) అనే వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన మండలంలోని మదనాపురంలో శుక్రవారం చోటుకుంది. రాత్రి భోజనానంతరం ఇంట్లో పడుకున్న ఆయనను అటువైపుగా వచ్చిన పాము కాటువేసింది. ఒక్కసారి ఉలిక్కిపడి లేచిన అతడు ఏదో కరిచినట్లు అనిపించిందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. పాము కరిచి ఉంటుందని చెప్పి, అతడిని దగ్గరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున ఆయన మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ శ్రీరాములు తెలిపారు.

వాహనం ఢీకొని యాచకుడు..



మృతి చెందిన యాచకుడు

కొత్తవలస: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు దుర్మరణం చెందిన ఘటన మండలంలోని అరకు–విశాఖ రోడ్డులోని నిమ్మలపాలెం గ్రామం సమీపంలో రాయి చెరువు వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. ఎస్‌ఐ వీరజనార్దన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గత కొంతకాలంగా జిందాల్, నిమ్మలపాలెం పరిసర ప్రాంతాల్లో బిచ్చమెత్తుకుంటూ జీవిస్తున్న అతడు వాహనం ఢీకొని, తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో ఉండడం చూసి, స్థానికులు గమనించారన్నారు. వారు అతడిని వైద్యసేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలించారన్నారు. అక్కడే చికిత్స పొందుతుండగా అతడు చనిపోయినట్లు తెలిపారు. ఈ మేరకు నిమ్మలపాలెం రెవెన్యూ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దైవదర్శనం చేసుకుని, వస్తుండగా..



సంఘటన స్థలంలో తీవ్రగాయాలతో అప్పారావు

పార్వతీపురం టౌన్: స్థానిక ఎస్పీ కార్యాలయం జంక్షన్‌లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కైంకర్యం అప్పారావు(63) మృతి చెందగా, ఆయన భార్య లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పార్వతీపురంలోని వైకేఎం కాలనీ, బాలాజీనగర్‌కు చెందిన అప్పారావు తన భార్యతో కన్యకాపరమేశ్వరి ఆలయానికి వెళ్లి, దైవదర్శనం చేసుకుని తిరిగివస్తుండగా, వారికి ఎదురుగా ఇద్దరు యువకులతో వస్తున్న మోటార్‌బైక్ వారి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలిద్దరూ తీవ్రగాయాలపాలు కాగా అప్రమత్తమైన స్థానికులు వైద్యసేవల నిమిత్తం వారిని ఆటోలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పారావు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ క్రమంలో అతడిని విశాఖపట్నం తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రి మృతదేహం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణంలో ఆదివారం నుంచి శరన్నవ రాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతాయని ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి ఆహ్వాన ప్రతులను రామనారాయణం ప్రాంగణంలో శనివారం ఆవిష్కరించారు.

సునాయాసంగా కేరళ, బరోడా, మధ్యప్రదేశ్ జట్ల విజయం



విజ్జి స్టేడియంలో కేరళ-బీహార్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ దృశ్యం

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న అంతర్ రాష్ట్ర అండర్–19 మహిళల వన్డే క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శనివారం జిల్లాలోని మూడు వేదికల్లో జరిగిన మ్యాచ్‌లలో బీహార్‌పై కేరళ జట్టు, మిజోరంపై బరోడా జట్టు, అస్సాంపై మధ్యప్రదేశ్ జట్టు సునాయాసంగా విజయం సాధించాయి. జిల్లా కేంద్రం శివారులోని సర్ విజ్జీ క్రికెట్ స్టేడియంలో కేరళ, బీహార్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బీహార్‌పై కేరళ జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన బీహార్ జట్టు 35.4 ఓవర్లలో 93 పరుగులు చేసి, ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కేరళ జట్టు 20 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 96 పరుగులు చేసి, విజేతగా నిలిచింది. డెంకాడ మండలంలోని చింతలవలసలో డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో బరోడా, మిజోరం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బరోడా జట్టు 7 వికెట్ల తేడాతో ప్రత్యర్థి జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన మిజోరం జట్టు 26.1 ఓవర్లలో కేవలం 44 పరుగులు చేసి, ఆలౌట్ కాగా 45 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన బరోడా జట్టు కేవలం 4.3 ఓవర్లలోనే విజయలక్ష్యం చేరుకుంది. ఇదిలా ఉండగా, దాకమర్రి సమీపంలోని కందుకూరి క్రికెట్ మైదానంలో మధ్యప్రదేశ్, అస్సాం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొంది, టోర్నీలో వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన అస్సాం జట్టు 31.5 ఓవర్లలో 83 పరుగులు చేసి, ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మధ్యప్రదేశ్ జట్టు కేవలం 16 ఓవర్లలోనే 87 పరుగులు చేసి, విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

తుపాకీతో బెదిరించిన వ్యక్తి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకీ

జామి: తుపాకీతో లారీ డ్రైవర్‌ను బెదిరించిన ఘటనలో మండలంలోని గడబపాలెం గ్రామానికి చెందిన లగుడు నాయుడు అనే వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీఐ బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కొన్ని రోజుల క్రితం గడబపాలెంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో అతడికి చెందిన నాటుతుపాకీని లగుడు నాయుడు దగ్గర మర్చిపోయి వదిలేసి వెళ్లిపోయాడు. శుక్రవారం రాత్రి గ్రీన్‌ఫీల్డ్ హైవే పైకి లగుడు నాయుడు వచ్చి, అదే తుపాకీతో అటువైపుగా వస్తున్న లారీ డ్రైవర్ ప్రసాద్‌ను బెదిరించాడు. దీనిపై లారీ డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు, అతడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అనంతరం అతడి వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

సెలవుల సందడి

దసరా సెలవులు కావడంతో విద్యార్థుల రాకపోకలతో బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు శనివారం కళకళలాడాయి. పండగ నేపథ్యంలో ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు 10 రోజుల పాటు విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో దూరపు ప్రాంతాల్లో చదువుకుంటున్న వారంతా ఇంటికి తరలివస్తున్నారు. వారి రాకకోసం తల్లిదండ్రులు, బంధువులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. సెలవుల ఆనందంలో విద్యార్థులు.. కొన్ని నెలల తర్వాత ఒక్కసారిగా తమ పిల్లలను చూసిన సంతోషంలో తల్లిదండ్రులు ఉన్న దృశ్యాలు సాక్షి కెమెరాకు శనివారం చిక్కాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్



విజయనగరం ఆర్‌టీసీ బస్టాండ్‌లో నడిచివస్తున్న విద్యార్థులు



విజయనగరం రైల్వేస్టేషన్‌లో పిల్లలను రిసీవ్ చేసుకుంటున్న తల్లిదండ్రులు